# తిట్లు నేర్పుడా.. తిండి పెట్టుడా!



ఎన్నికల మ్యానిఫెస్టోను అమలు చేయటం అధికారంలోకి వచ్చిన పార్టీ బాధ్యత. మ్యానిఫెస్టోలో చెప్పిన వాటినే కాదు.. ఇవ్వని హామీలను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసింది. కల్యాణలక్ష్మి నుంచి మొదలుపెడితే గురుకులాల దాకా అనేకం ఉన్నయ్. -కేసీఆర్

మొదటిపేజీ తరువాయి...

బీఆర్ఎస్‌లో చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సహా ఇటీవలి కాలంలో కొంత మంది మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన పరోక్షంగా తప్పుబట్టారు.

### దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు..

ప్రభుత్వంలో ఉన్నవాళ్లు సమాజంలో ఉన్న రుగ్మతలను శాశ్వతంగా పోగొట్టేందుకు ముందుకుసాగాలని కేసీఆర్ సూచించారు. 'అందర్నీ కాపాడాల్సిన బాధ్యత..అందరికీ లాభం చేకూర్చే బాధ్యత తీసుకోవాలె. కానీ, నేను మంచిగుండాలె.. నావోడు మంచిగుండాలె అనుకోవటం అవివేకం. ప్రభుత్వంలో ఉన్నవాళ్లు ఏం మాట్లాడుతున్నారో ప్రజలందరూ గమనిస్తున్నరు. ఏం కోల్పోయామో వాళ్లకు అర్థమవుతున్నది. ఎన్నికల సమయంలో ఇచ్చిన మ్యానిఫెస్టోను అమలు చేయటం అధికారంలోకి వచ్చిన పార్టీ బాధ్యత. బీఆర్ఎస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో చెప్పిన వాటినే కాదు.. ఇవ్వని హామీలను కూడా అమలు చేసినం' అని కేసీఆర్ గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిందని, ఆడపిల్లలకు స్కూటీలు, రైతు భరోసా కింద రూ.15 వేలు, దళితబంధు, గిరిజన బంధుకు రూ.12 లక్షలు, రుణమాఫీ ఇలా ఒక్కటే మిటి అవకాశం ఉంటే సూర్యచంద్రులను తెచ్చి ఇస్తామని చెప్పి కొసాఖరుకు చుక్కలు చూపిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### ఎవరూ అధైర్యపడొద్దు..రాబోయేది బీఆర్ఎస్సే

'పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దు.. హైరానా పడొద్దు.. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే' అని కేసీఆర్ స్పష్టంచేశారు. 'ప్రభుత్వం ఏర్పడ్డాక ఆర్నెళ్లకు పూలదండలు..బొకేలకే పోతుంది.. చివరి ఆర్నెళ్లకు ఎన్నికల హడావుడే మొదలవుతుంది.. మధ్యలో ఉన్న నాలుగేండ్లు ప్రజలకు ఏం కావాలో చేయాల్సి ఉంటుంది' అని వివరించారు. 'రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు పూర్తవుతున్నా ఏం చేయాలో తెలుస్తలేదు. ఏం సగబెట్టాలో తెలుస్తలేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలో ఉన్న వారందరికీ న్యాయం చేయాలని, కానీ, ఈ ప్రభుత్వం ప్రజలకు మంచి చేయటం పక్కనపెట్టిందని విమర్శించారు. పిచ్చి పిచ్చి మాటలు.. ఛండాలమైన పనులు తప్ప ఒక్క మంచిపని కూడా కనిపించటం లేదన్నారు. 'ఇది కూలగొడ్తం..అది కూలగొడ్తం. వాన్ని లోపలేస్తం. వీన్ని లోపలేస్తం.. ప్రభుత్వం అంటే గిదే ముచ్చటా? తిట్లు మనకు రావా..ఇయ్యాల మొదలు పెడితే రేప్పొద్దున దాకా తిట్టొచ్చు. తిట్టుడు మన విధానం కాదు' అని చెప్పారు. పార్టీ శ్రేణులు ఓపికతో ఉండాలని, ప్రజల కోసమే పనిచేయాలని పిలుపు నిచ్చారు. పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్నప్పుడు ఎర్రబెల్లి దయాకర్ రావు పల్లెలను అద్భుతంగా తీర్చిదిద్దారని, ప్రజల కోసం పనిచేసే నాయకులు పార్టీలో ఉన్నారని, కార్యకర్తలు అధైర్యపడొద్దు.. ఆగం కావద్దని సూచించారు.



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరిన సినీ నిర్మాత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు. చిత్రంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, జీవన్‌రెడ్డి

బీఆర్ఎస్ శ్రేణులు ఓపికతో ఉండాలె. ప్రజల కోసమే పనిచేయాలె. పిచ్చిపిచ్చి మాటలను పట్టించుకోవాల్సిన పనిలేదు. ప్రజల మధ్యలో ఉండి.. ప్రజల కష్టసుఖాల్లో భాగం కావాలె. ఒక వ్యక్తి ప్రయోజనం కోసమో.. ఓట్ల కోసమే మనం పనులు చేయలేదు. ప్రజలు తప్పకుండా మన వెంటే ఉన్నరు. కార్యకర్తలు హైరానా పడొద్దు.. మళ్లీ అధికారం మనదే.. -కేసీఆర్

### కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో పారుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహా పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ గాంధీనాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి, అనిమిరెడ్డి, మునావత్ నర్సింహనాయక్, పసునూరి నవీన్ కుమార్, శ్రీనివాస్‌రావు, రంగుకుమార్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి బాసటగా...

పాలకుర్తి మండలం కొండాపురం శివారు మేకల తండాకు చెందిన గిరిజన యువకుడు లకావత్ శ్రీను నాయక్ పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని పోలీస్ స్టేషన్‌లో మరణించారు. అతడి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి కేసీఆర్ రూ. 3లక్షల ఆర్థిక సాయం అందజేశారు. గిరిజన బిడ్డకు న్యాయం జరిగే వరకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తాను పాలకుర్తి వచ్చినప్పుడు వారి ఇంటికి వస్తానని చెప్పారు.

లోకం పోకడ




ప్లేట్ మిర్చీ బజ్జీలో ఒక బజ్జీ మిస్సింగ్.. దర్యాప్తు జరిపి వీడిని జైల్లో తోసేయండి!



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, లక్ష్మారెడ్డి

## రేవంత్‌రెడ్డీ.. ముఖ్యమంత్రివా? వీధి రౌడీవా?

**మాజీ సీఎం కేసీఆర్‌పై ఏమిటా బజారు భాష?**

**సీఎం సంస్కారవంతమైన భాష మాట్లాడాలి**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హితవు**

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డీ.. రాష్ట్రానికి ముఖ్యమంత్రివా? లేక వీధి రౌడీవా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నిలదీశారు. పదేండ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి తెలంగాణను అగ్రస్థానంలో నిలబెట్టిన కేసీఆర్‌పై ఏమిటా బజారు భాష? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ప్రజలకు రోల్‌మాడల్‌గా ఉండాలని, సంస్కారవంతమైన భాష మాట్లాడాలని హితవు పలికారు. మూసీ అభివృద్ధి పేరుతో నిర్వాసితులకు నష్టం జరుగొద్దని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నదని గుర్తుచేశారు. తెలంగాణభవన్‌లో శనివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, నేతలు గోపగాని రఘురాం, కడారి స్వామితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మూసీ ప్రక్షాళన ప్రారంభించిందే బీఆర్ఎస్ అని, దానిని తాము అడ్డుకుంటున్నట్టు రేవంత్‌రెడ్డి ఆరోపించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. మూసీ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా తనను నియమించి కేసీఆర్ మూసీ అభివృద్ధికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. 'మూసీ ప్రక్షాళన చేయాలనే చిత్తశుద్ధి అసలు మీకు ఉన్నదా? కేవలం ప్రతిపక్షాలను బెదిరించాలనుకుంటున్నారా? పండబెట్టి తొక్కుతా.. వంగబెట్టి గుద్దుతా.. పేగులు మెడలో వేసుకుంటా.. ఏందీ భాష అని నిలదీశారు. సీఎం స్థాయిలో ఉండి జుగుప్సాకర భాష మాట్లాడటంపై ప్రజలు చింతిస్తున్నట్టు తెలిపారు. మూసీ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసినందుకు 'బుల్డోజర్లతో తొక్కిస్తా.. ముక్కలుగా నరికేస్తా.. కుక్కచావు చస్తవు..' అంటూ నీచమైన భాష మాట్లాడడంపై మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనకు బీఆర్ఎస్ రూ.4వేల కోట్లతో ఎస్టీపీల నిర్మాణం చేపట్టిందని, దాదాపు ఎనిమిదింటి నిర్మాణం పూర్తయిందని గుర్తుచేశారు.

### దమ్ముంటే హైదరాబాద్‌లో పాదయాత్ర చేయాలి..

నల్లగొండ, హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల ప్రజల మధ్య రేవంత్‌రెడ్డి చిచ్చుపెడుతున్నారని సుధీర్‌రెడ్డి మండిపడ్డారు. నల్లగొండ జిల్లా రైతులను సీఎం రెచ్చగొడుతున్నారని విమర్శించారు. అర్ధరాత్రి పోలీసులను పంపి ఇండ్లను ఖాళీ చేయాలని ప్రభుత్వం మూసీ బాధిత పేదలపై ఒత్తిడి తెస్తున్నదని ఆరోపించారు. మూసీ ఒడ్డున ఉన్నవాళ్లు బిక్కుబిక్కుమంటూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మూసీ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్యాకేజీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. డీపీఆర్, టెండర్లు లేకుండా లక్షన్నర కోట్ల ఖర్చు అవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు చెప్పారని విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో ఎన్ని అమలు చేసిందో ప్రజలకు తెలుసు.. రుణమాఫీ ఎంతమందికి అయిందో తెలుసు.. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే నల్లగొండలో కాదు హైదరాబాద్‌లో పాదయాత్ర చేయాలని సవాల్ విసిరారు.

# ..బూతుల సీఎం రేవంత్

- కేసీఆర్‌వి కిట్లు.. రేవంత్‌రెడ్డివి తిట్లు
- రేవంత్‌రెడ్డికి 'ఏ' సర్టిఫికెట్ ఇవ్వాలి
- మూసీ కంటే రేవంత్ నోటి కంపే ఎక్కువ
- రైతులు ఇబ్బందులు పడుతుంటే సీఎం, మంత్రులు జల్సాలు చేస్తుండ్రు
- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌కు 100 సీట్లతో అధికారం ఖాయం
- ఇండ్లు కూల్చిన చోటు నుంచే పాదయాత్ర చేద్దాం.. సిద్ధమా రేవంత్?
- కొల్చారం రైతు గర్జనలో హరీశ్‌రావు ఫైర్



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం కొల్చారంలో నిర్వహించిన రైతు గర్జనలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మెదక్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ)/నర్సాపూర్ : 'పోరాడితే పోయేదేం లేదు.. బానిస సంకెళ్లు తప్ప.. పోరాడితే పోయేదేం లేదు రైతుబంధు వస్తది.. రుణమాఫీ జరుగుతది.. మీ అందర్నీ చూస్తుంటే మళ్లీ ఉద్యమ రోజులు గుర్తుకు వస్తున్నయ్' అని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం కొల్చారంలో నిర్వహించిన రైతు గర్జనకు తరలివచ్చిన వేలాది మంది రైతులను చూసి ఆయన ఉత్సాహంగా ప్రసంగించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హరీశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి రైతు రుణమాఫీ చేసేందుకు ఎమ్మెల్యే సునీతారెడ్డి రైతు దీక్ష ఏర్పాటు చేశారని చెప్పారు. పంట చేతికొచ్చినా రైతుబంధు ఇవ్వలేని కాంగ్రెస్ సర్కార్ అసమర్థతను ఎత్తిచూపేందుకే ఈ దీక్ష అని తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా, ఎవరూ అడగకున్నా రైతుల కోసం రైతు బంధు పెట్టింది కేసీఆర్ అని గుర్తుచేశారు. ఎకరానికి పదివేల రైతుబంధు, ఐదు లక్షల రైతుబీమా అందించిందీ కేసీఆరేనని చెప్పారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చింది, రైతుల పంటను గింజ లేకుండా కొన్నది కూడా కేసీఆరేనని, అందుకే కేసీఆర్ రైతుల సీఎంగా పేరు తెచ్చుకుంటే రేవంత్‌రెడ్డి బూతుల సీఎంగా చరిత్రలో నిలిచాడని హరీశ్ ఎద్దేవాచేశారు.

కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని రేవంత్‌రెడ్డి వాగుతున్నడు.. యాదాద్రిలో పూజ చేసిన ఆలయమే కేసీఆర్ ఆనవాలుకు ప్రతిరూపం కదా? కేసీఆర్‌ను తిడుతవ్.. కేసీఆర్ కట్టిన గుడిలో పూజలు చేస్తవ్.. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడమంటే తెలంగాణనే లేకుండా చేయడం. -హరీశ్‌రావు

నల్లగొండకు ఫ్లోరైడ్ పీడ కాంగ్రెస్, టీడీపీల పుణ్యమే.. కేసీఆర్, తెలంగాణ విలువ ఆంధ్రాబాబుల బ్యాగులు మోసిన రేవంత్‌రెడ్డికి ఎలా తెలుస్తది? తెలంగాణను ఫ్లోరైడ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దింది కేసీఆర్.. పిల్లి శాపనార్థాలకు ఉట్లు తెగవు.. రేవంత్‌రెడ్డి తిట్లకు ఈ గులాబీ జెండాలు భయపడవు.. - హరీశ్‌రావు

### మల్లన్నసాగర్ లేకుంటే మూసీకి గోదావరి నీళ్లు వస్తయా?

**కేసీఆర్** మల్లన్న సాగర్ కట్టి ఉండకపోయే గోదావరి నీళ్లు మూసీకి వస్తాయా? అని హరీశ్ ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా మీద రేవంత్‌రెడ్డి ఎంతో ప్రేమ ఉన్నట్టు మాట్లాడుతున్నాడని, నల్లగొండ ప్రజల నుంచి ఫ్లోరైడ్ మహమ్మారిని తరిమికొట్టింది కేసీఆర్ అని గుర్తుచేశారు. నల్లగొండ ప్రజల నడుములు వంకర పోవడానికి రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలే కారణమని చెప్పారు.

### కూల్చిందెక్కడ.. నడిచిందెక్కడ?

'నువ్వు కూల్చిన ఇండ్లెక్కడ.. కాలిన కడుపులెక్కడ, నువ్వు నడిచిందెక్కడ?' అని రేవంత్‌రెడ్డిని హరీశ్ సూటిగా ప్రశ్నించారు. హైదరాబాద్‌లో పేదల ఇండ్లు కూల్చి, వారి కడుపు కాల్చి పాదయాత్ర చేసేది మాత్రం నల్లగొండలోనా అంటూ చురకలంటించారు. 'రేవంత్‌రెడ్డీ.. కూల్చిన ఇండ్ల వద్దకు వెళ్దాం.. కాలిన కడుపులను అడుగుదాం.. హైదరాబాద్‌లో నడుద్దాం రా' అంటూ సవాల్ విసిరారు. 'ఎక్కడైతే మూసీలో ఇండ్లు కూలగొట్టావో అక్కడి నుంచే పాదయాత్ర చేద్దాం' అని చెప్పారు. '66 ఏండ్ల కాంగ్రెస్, టీడీపీల పుణ్యమే మూసీ కాలుష్యం.. కేసీఆర్ రూ.3800 కోట్లు ఖర్చు పెట్టి మూసీ పునర్జీవాన్ని మొదలుపెట్టిండ్రు' అని గుర్తుచేశారు.

### రేవంత్ నోరు తెరిస్తే అబద్ధాలు

రేవంత్‌రెడ్డి మాటలు చూస్తుంటే రాజకీయాల్లో కూడా ఏ సర్టిఫికెట్ పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవాచేశారు. నాయకుడు ఎవరైనా ప్రజలకు మార్గదర్శకంగా ఉండాలని, మంచిబాటలో నడవాలని సూచించారు. 'రేవంత్‌రెడ్డి నోరు తెరిస్తే అబద్ధాలు తప్ప ఏమీ రావు' అని ఎద్దేవాచేశారు. తెలంగాణ కోసం మొట్టమొదటి రాజీనామా చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ నల్లగొండలో పుట్టిండని రేవంత్‌రెడ్డి అంటున్నాడని.. కొండా లక్ష్మణ్ బాపూజీ పుట్టింది ఆదిలాబాద్‌లో అని, ఈ ముఖ్యమంత్రి నోటికొచ్చిన అబద్ధాన్ని చెప్తూ సీఎం కుర్చీ విలువ దిగజార్చుతున్నాడని మండిపడ్డారు.

### అధికారులు, పోలీసులు ఖబర్దార్

ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ 100 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని హరీశ్ ధీమా వ్యక్తంచేశారు. 'ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటి మీదనే దాడి చేశారు.. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై అన్యాయంగా కేసులు పెట్టినా, వేధించినా తస్మాత్ జాగ్రత్త.. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. అధికారులు, పోలీసులు ఖబర్దార్.. మా ప్రభుత్వంలో వడ్డీతో సహా చెల్లిస్తం ' అని హెచ్చరించారు.

### రాష్ట్ర ప్రతిష్ఠ పెంచిన కేటీఆర్..

మాజీ మంత్రి కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తామని లీకులు పంపిస్తున్నారని, కేటీఆర్ ఏం చేశాడని అరెస్ట్ చేస్తారని ప్రభుత్వాన్ని హరీశ్ ప్రశ్నించారు. కేటీఆర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచాడని, రాష్ట్ర గౌరవ ప్రతిష్ఠలు పెంచాడని, ముంబయి, ఢిల్లీ, బెంగళూర్‌ను కాదని హైదరాబాద్‌కు పెట్టుబడులు తెచ్చాడని, ఐటీలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపాడని కొనియాడారు. డైవర్షన్ రాజకీయం కోసం కేసులు పెడతాం, అరెస్టులు చేస్తాం అని కాంగ్రెస్ నాయకులు లీకులిస్తున్నారని మండిపడ్డారు.

### మంత్రిపై ఎందుకు కేసు పెట్టరు?

కాంగ్రెస్ గ్యారెంటీలపై కేవలం ప్రశ్నించినందుకే సోషల్ మీడియా ఆక్టివిస్ట్ రంజిత్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని, మరి తెలంగాణ సాధకుడు కేసీఆర్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చంపేస్తానని, మూడు ముక్కలు చేసి మూసీలో వేస్తానని బహిరంగంగా మాట్లాడినా పోలీసులు ఎందుకు కేసు పెట్టలేదని హరీశ్ ప్రశ్నించారు. హింసను ప్రేరేపించేలా ఓ మంత్రి మాట్లాడుతుంటే ముఖ్యమంత్రి ముసిముసి నవ్వులు నవ్వుతున్నాడని మండిపడ్డారు. 'డీజీపీని సూటిగా అడుగుతున్నా.. రంజిత్‌రెడ్డి మీద కేసు పెట్టారు.. మరి రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన మంత్రి మీద ఎందుకు కేసు పెడుతలేరు?' అని ప్రశ్నించారు. ఇలా మాట్లాడిన వారిని మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని గవర్నర్ కోరుతున్నట్టు చెప్పారు. నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గతంలో నిరాహారదీక్ష చేస్తే కాంగ్రెస్ పార్టీ ఇతన్ని వదిలేసింది.. కేసీఆర్ ఆదేశాలతో మేమంతా వెళ్లి ఆయనకు ధైర్యం చెప్పినం. కేసీఆరే దీక్ష విరమింపజేసి ప్రాణాన్ని కాపాడిండు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కొడుకు చనిపోతే కేసీఆర్ ఓదార్చిండు.. అటువంటి కేసీఆర్‌ను పట్టుకొని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటువంటి భాష మాట్లాడవచ్చునా?' అని హరీశ్ నిలదీశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో పాటు ఏడోది బూతుల గ్యారెంటీ అని పెట్టింటే బాగుండేదని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం బట్టలు ఇప్పిండని.. అన్యాయాలను ప్రశ్నించిండని, మోసాలను ఎండగట్టిండని కేటీఆర్‌పై ముఖ్యమంత్రి పగబట్టిండు. ఇది కేటీఆర్ మీద దాడి కాదు.. రాష్ట్ర ప్రజల మీద, బీఆర్ఎస్ మీద, ప్రశ్నించే గొంతుకల మీద దాడి. -హరీశ్‌రావు

### 30శాతం వడ్లు దళారుల పాలు

తెలంగాణలో 30 శాతం వడ్లు దళారులు పాలయ్యాయని, ప్రభుత్వం ధాన్యాన్ని కొనే పరిస్థితి లేదని, రైతులు దళారులకు రూ.1700కు అమ్ముకుంటున్నారని హరీశ్‌రావు తెలిపారు. 'రైతులకు రూ.2300 మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ కలిపి రూ.2800 కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాలి. కానీ, రేవంత్‌రెడ్డి చేతగాని ప్రభుత్వం వల్ల వెయ్యి రూపాయలు రైతు నష్టపోతున్నాడు' అని ఆవేదన వ్యక్తంచేశారు. 'ముఖ్యమంత్రి ప్రత్యేక విమానంలో మహారాష్ట్రకు పోతే డిప్యూటీ సీఎం మరో ప్రత్యేక విమానంలో జార్ఖండ్ వెళ్లారట, ఇంకో మంత్రి సీతక్క కేరళకు, మరో మంత్రి శ్రీధర్‌బాబు మలేషియాకు వెళ్లారట. ప్రజలేమో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే గాలి మోటర్లపై సీఎం, మంత్రులు జల్సాలు చేస్తున్నరు.. రైతులను, ప్రజలను గాలికి వదిలేసిండ్రు' అని దుయ్యబట్టారు. ఏం సాధించారని 14 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రజా విజయోత్సవాలు జరుపుతారని ప్రశ్నించారు.

### రేవంత్‌రెడ్డి అంటే వినాశనం : దేశపతి

'కేసీఆర్ అంటే వికాసం.. రేవంత్ రెడ్డి అంటే వినాశనం' అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. కొల్చారం రైతు గర్జనలో ఆయన మాట్లాడుతూ 'డిసెంబర్ 7 వస్తే యాడాది దినం.. సంవత్సరీకం.. ఏడాది కూడా నిండలేదు.. ఈ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయింది.. మార్పు మార్పు అన్నారు.. ఇది మార్పు కాదు ఏమార్పు' అని మండిపడ్డారు. రైతు గర్జనలో ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్యరావు, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవ రెడ్డి, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, సమావేశంలో వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ మన్సూర్ పాల్గొన్నారు.

### మహారాష్ట్ర ఎన్నికల్లో అబద్ధాలు సిగ్గుచేటు

**తెలంగాణలో** ఆరు హామీలు అమలు చేశామని మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో చెప్పుకొంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదని హరీశ్ మండిపడ్డారు. 'మహిళలకు రూ.2500 ఇస్తామన్నరు.. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నరు.. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నరు.. 4వేల పెన్షన్ ఇస్తామన్నరు.. ఒక్కటైనా నెరవేర్చిండ్రా?' అని నిలదీశారు. అన్ని హామీలను ఎగ్గొట్టి తెలంగాణ ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి.. మహారాష్ట్ర ఎన్నికల్లో మాత్రం గ్యారెంటీలు అమలు చేశామని అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటని దెప్పిపొడిచారు. 'రేవంత్‌రెడ్డి వచ్చాక గ్యారెంటీకి.. బాండ్ పేపర్‌కు విలువ లేకుండా పోయింది. కాంగ్రెస్ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి గ్యారెంటీ అనే పదానికే విలువ తీసేసింది' అని ఎద్దేవాచేశారు.

మూసీ కంపు కంటే రేవంత్‌రెడ్డి నోటి కంపు ఎక్కువైంది.. ఇంత బజారు భాష మాట్లాడే ముఖ్యమంత్రి దేశంలోనే ఎక్కడా లేడు. టీవీలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతుంటే కాంగ్రెస్ నాయకులు కూడా వాళ్ల పిల్లలు చెడిపోతారనే భయంతో చానళ్లు మారుస్తున్నరు. రేవంత్‌రెడ్డికి ఏ సర్టిఫికెట్ ఇవ్వాలి. సినిమాలకు సెన్సార్ బోర్డు ఉన్నట్టు రాజకీయ నాయకుల భాషకు కూడా ఓ బోర్డు పెట్టాల్సిన పరిస్థితి నెలకొన్నది. - హరీశ్‌రావు



## నిధులు మరిచి తిట్ల పురాణం సిగ్గుచేటు

**నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి, కంచర్ల భూపాల్‌రెడ్డి**

నీలగిరి, నవంబర్ 9 : పుట్టిన రోజు సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పైసా నిధులు ఇవ్వకపోగా తిట్ల పురాణం పెట్టడం సిగ్గుచేటని నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పుట్టిన రోజైనా రేవంత్‌రెడ్డి తన బుద్ధి, భాష మార్చుకోకపోవడం సిగ్గుచేటన్నారు. 11 నెలల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకొనేందుకు ఏమీ లేక కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును తిట్టడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి వాడుతున్న భాష సభ్య సమాజానికి ఏం సందేశం ఇస్తున్నదో ఆలోచించుకోవాలని హితవు పలికారు. మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటే బుల్డోజర్లతో తొక్కిస్తం.. ముక్కలు చేస్తాం... కుక్క చావు చస్తావ్ అంటూ మాట్లాడడం హత్యా రాజకీయాలను ప్రోత్సహించేలా ఉన్నాయని పేర్కొన్నారు. సీఎం స్థాయిని దిగజార్చుతున్న రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం సిగ్గుశరం ఉన్నా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



## రాష్ట్రం అగ్నిగుండమే

యాదగిరిగుట్ట, నవంబర్ 9 : తెలంగాణ జాతిపిత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను టచ్ చేస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారడం ఖాయమని టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్, నల్లగొండ డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్‌ను, ఆయన చరిత్రను ఎవ్వరూ టచ్ చేయలేరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. కేంద్రంతో కొట్లాడి రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తిని అసభ్యకరమైన భాషతో మాట్లాడటం అహంకారమేనని పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.



## డైవర్షన్ పాలిటిక్స్?

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ సాధకుడు కేసీఆర్‌పై ఇష్టానుసారం మాట్లాడితే చూస్తూ ఊరుకోమని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ హెచ్చరించారు. మూసీ పునరుజ్జీవన యాత్రలో బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై శ్రీనివాస్ ట్వీట్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతకాకనే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు.

## కేసీఆర్ అంటే సీఎం రేవంత్‌కు భయం

**మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**



హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అంటే భయమని, అందుకే రేవంత్ తన పుట్టిన రోజున కూడా కేసీఆర్ పేరు ఎత్తకుండా ఉండలేకపోయారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ముఖ్యమంత్రి మాట్లాడుతుంటే మహిళలు, చిన్నపిల్లలు టీవీలు బంద్ పెట్టుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. తెలంగాణ ప్రదాత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయి. అత్యున్నత పదవిలో ఉండి ఇలా మాట్లాడి సభ్యసమాజానికి ఏం సందేశం ఇస్తారు. ఎలాంటి విలువలు నేర్పుతారు. కనీసం పుట్టిన రోజున కూడా కేసీఆర్ పేరు ఎత్తకుండా ఉండలేకపోయారంటే.. ఆయనంటే మీకు ఎంత గుబులు ఉందో అర్థమవుతుంది. మీ వ్యాఖ్యలను యావత్ ప్రపంచం ఖండిస్తున్నది. ఒకరి చావును కోరుకోవడం ఎంత వరకు సమంజసం?' అని ప్రశ్నించారు.



## సీఎం రేవంత్‌రెడ్డిది వక్రబుద్ధి

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై శాపనార్థాలు పెడుతూ తన వక్రబుద్ధిని బయటపెట్టుకున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ పునరుజ్జీవనం పేరిట చేపట్టిన యాత్రలో సీఎం రేవంత్, మంత్రి వెంకట్‌రెడ్డి మాటలు అర్థరహితమని కొట్టిపారేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ... పదేండ్ల పాలనలో నల్లగొండ ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని, అలాంటి వ్యక్తిపై ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి కోమటిరెడ్డి గ్యాంగ్‌స్టర్లలా మాట్లాడుతున్నారని విమర్శించారు.